3 శాఖాపంతులుగారు

ఉన్నదున్నట్టు, జరిగింది జరిగినట్టు, వ్రాదామని సంకల్పించుకున్నా నీతడవ. ఎంచేతా అంటే — కల్పించుకొంటూ ఎన్ని వ్రాసినా ముక్తి మోక్షం లేదనిపించడంవల్లను, మఱీన్నీ చదువరులూరకే ఆ అబద్ధపు కలపనాలు చదివి "నిజంగా జరిగిందేనా అండీ" అని అడిగితే "లేదోయి అబద్ధమే నిబద్ధిగా కనబడేటట్టు వ్రాసేనోయి" అని బుకాయించవలసి వస్తూండడంవల్లను, ఇంతకూ ఒక్క సత్యము తులనిడి దూచిన అన్న పద్యములో చెప్పినట్లు ఒక్క సత్యముతో సరైంది, నైతికశాస్త్రమందేమి ధర్మచర్చలందేమి, వేదాంత గోష్ఠియందేమి, లేదని చాటడంవల్లను — ఇన్ని విధాలుగా మనసు కుదుట పరచుకొని నేటికున్నదున్నట్లు జరిగింది జరిగినట్లు వ్రాదామని సంకల్పించుకున్నాను.

అయితే ఆ మార్గ మనుకొన్నంత సుళువు కాదనిపిస్తోంది. బ్రతికున్న వాళ్ళనుగూర్చి యున్నదున్నట్లుగా వ్రాస్తిమా — వాళ్ళకు కులుకుం సెడీ యులుకు రావడమేకాకుండా వ్రాయసగాని మీద పరువు నష్టపు వ్యాజ్యాలు బనాయిస్తారు. అంచేత ఈ ఫక్కీ రచనలన్నీ మృతులైన వాళ్ళను గురించే రచించాలి. మహామృతుడైనవాడు పెళ్ళికానివాడై యుండాలి, పిల్లల్లేనివాడై యుండాలి; లేకపోతే వాణ్ణి కీర్తిశేషులుగా, గీర్తించక వ్రాస్తే యా పెండ్లాంబిడ్డలు కలవొస్తారు. మెటికలు విఱుస్తారు. అతగా డాస్తిలేనివాడై యుండాలి. కాకుంటే చదువరు లాస్తి

యెక్కడుంది ? వాని కాయాస్తి యందెట్టిహక్కుంది ? ఎవళ్ళూ లేకపోతే
అదెవరికి సంక్రమిస్తుంది ? వ్రాసేమీకా ! చదివేమాకా ? లేకుంటే
సర్వం సహాయిస్వాహా అంటూ నిర్మాణమైన ప్రభుత్వం వారికా ? అనే
దురూహల్లోకి దిగుతారు. మఱి బొద్దూ పొడుగూ అందం చందంలేని
వాడవాలి. ఆలాకాకపోతే వానియొక్క సూక్ష్మదేహాన్ని గురించి యోజిస్తూ,
అంత్యవిరహంలో అంతవఱకూ పడున్న అప్సరసలు, గంధర్వీణులు,
కిన్నెరసానులు, నాగాంగనలు, నరాంగనలు, అంతా ఒక్కమాటుగా
జ్ఞప్తిలోబడి, గొల్లుమంటారు. అంచేత ఎన్నో మినహాయింపులు చూచు
కొని పన్నాగం కాకుండా, ఉన్నదున్నట్టు జరిగింది జరిగినట్టు వ్రాయట
మనేదుండే అది బహూప్రయాస.

అందుకే అందరూ ఇట్టిట్టే తమమోహ మోరాసక్రీడ ఘట్టంగుండా
వెలిబుచ్చుకొని, తమ శోక మో సీతమ్మవారి వనవాస గాథలాగ రోదించు
కొని, తమ విరాగ మో శుక మహర్షి యమాయక రూపంద్వారా ద్విగుణీ
కృతం చేసికొని, అసలు సంగతి తేలక అన్నివిధాల అన్వయకాఠిన్యాలకు
అర్థాంతరన్యాసాలకు రాద్ధాంత సిద్ధాంతాలకు ఎడమిచ్చేరు. ఆపంథకు
అడ్డుతగిలేవాళ్లెవరూ ఉండరు. చిత్తం వచ్చినట్టుగా చిక్కం అల్లినట్టు
అల్లేయ్య వచ్చును.

అందుచేత నా యీ ప్రస్తుతభారం, సత్యంమీద ఆధారపడ్డది అయి
నప్పటికిన్నీ, తత్వంమీరంతా చదివే పాటంత సులభంగా రచింపబడ్డదికాదు.

అహో ! జ్ఞాపకం తెచ్చుకోగా తెచ్చుకోగా కనిపించేదో మాన
వుడు. — * శాఖాపంతులుగారు. దొడ్డికాళ్ళు ! మొగమ్మీదో కంతి ! —
పెళ్ళిలేదు. పెటాకుల్లేవు ! బెత్తెడు భూమి లేదు — బతికినన్నాళ్లూ
కత్తిరికొంపే.

అయితే వారింటిపేరు శాకావారా శాఖావారా ? అనే వితర్కింపు పోలేదు ఉన్నదున్నట్టుగా వ్రాస్తూ వున్నాగానీ. శాకావారనీ తోస్తుంది శాఖావారనీ తోస్తుంది. శాకావారని యనుకోవడానిక్కారణం ఆయన శాకపాకాదుల విషయంలో మిక్కిలి నిక్కచ్చి మనిషి. పనసకాయ సంపాదించినాడా అంటే పీటచెక్కమీద నిలుచుండబెట్టి, దాని చెక్కులు చెక్కడం కాణ్ణుంచి, పొట్టుక్రింద చితక్కొట్టి, ఆవపెట్టి, కరివేపాకు వేసి పోపులో నూని చాల్నంతోసి, రుచిచూసి, మహబాగావుంది అని అనుకొని తినేసేదాకా మఱి వీధిలోకి రాడు. అందుకోసంగా అమేషా ఓకత్తి ఓపసుపు డబ్బా, ఓ బంకగీకే అట్లకాడ, ఓ నూనిసిద్దీ అన్నీ ఓమూల అమారుగా వుండేవి నిత్తెమూ. మఱి అందునుగురించి అతని ఊహాస్వాతంత్ర్యం ఎంత పలకూ కొమ్ములు మెలితిరిగి పోయిందంటే—ఓనాడొకరు "అయ్యా ! కొన్నాళ్ళు చంద్రుడు కనబడక, అన్నీ చుక్కలే కనబతాయి : యేమిటండీ దాని సాంకేతికం ?" అని అడిగినారట. అడిగితే యీయన జవాబు చెప్పేట్టా—శచీదేవి ఇంద్రుని నిమిత్యార్థమై పచనం కోసంగాను ఇంద్రుణ్ణి కూరా ?" అంటే చంద్రుడనే పనసకాయ దెచ్చి అందులో ఉన్న నలుపు ముచిగ్గా పైకెగలాగి పట్టి తన వజ్రాయిధంతో చకాచకా పొట్టుగా కొట్టి పెళ్ళాంకిచ్చేట్ట. ఆ కొట్టినప్పుడు చెల్లా చెదురై విరజిమ్ముకు పోయిన కొంతపొట్టే యీ కనవచ్చే చుక్కలూ" అన్నాట్ట. దానిమీద సందేహ నివృత్తి కానివాళ్ళు "పనసకాయ నలుపా తెలుపా, చంద్రుణ్ణి పనసకాయ అనుకోవడం ఎట్లా తటస్థించిందీ?" అంటే "ఐరావతం ఆదిశేషువు తెలుపు. ఇంద్రజాల శాస్త్రంలో అన్నీ తెలుపే" అని "ఇంతకూ పనపకాయ తెచ్చి మాట్లాడుతున్నావా ? తేకుండా మాట్లాడుతున్నావా ? తేకపోతే వెళ్ళిపో. నా ముందుండకు ; నన్నేమీ అడక్కు ! వేదంలో చూచుకో ఆ పేరు కనిపిస్తుంది." అనేవాట్ట. దాంతో ఎంత వాదించేవాడైనా తోక

ముడుచుకు పోయేవాట్ట. దానాదీనా ఆయనకు శాకాహార ధురీణుడని బిరుదిచ్చి వారింటిపేరు నాటి నుంచి శాకావారని అనేవారు. అది శాకావారే గాని శాఖావారు కాదని కొందరి వాదం. మఱికొందరి వాదం వారిది చెప్పన్నశాఖల్లోను ఓ శాఖైన ప్రథమశాఖ అనీ, వార్లోనా దెవరో 'అయ్యా మీ దేశాఖండీ'' అంటే ''పప్రథమ శాఖ'' అని ''థ'' ''ఖ'' రెండక్షరాలు 'శంఖం' సిద్ధం' ఒత్తినట్టు ఒత్తేట్ట. అప్పట్నుంచి ఆయనకు శాఖాభిమానం మెండు అని ఆయన కందువిషయమై వారి శాఖవారంతా ఓ సభ చేసి ''శాఖాభిమాన మహామహిమాఢ్యుడు'' అనే బిరుదులిచ్చి వారింటిపేరు నాటినుండి శాఖావారుగా చేసి యున్నారని మఱికొందరి వాదం. ఈ వాగ్వివాదాలూ వితర్కింపులూ విడచిపెట్టి ఉన్నదున్నట్టుగానూ, జరిగింది జరిగినట్టుగానూ భావిస్తే కనబడేదివేఱు. ఆయన మొలనెప్పుడూ ధగధగలాడిపొయ్యే బత్తాయి చాకు వుండేది. ఆయన్నెవరైనా పలకరించాలీ అంటే ఆ చాకునుబట్టి ఆయన్ను గుర్తించి ''చాకాయన'' అని పిల్చేవారు. అసలింటిపేరూ పేరూ ఎవరికైనా చెబితేగా మహానుభావుడు—చాకాయన అనేదే ప్రథమ మీద కచటతలకు గసడదవలు వచ్చిన తరుణంలోనో లేకపోతే తూర్పు జనం ఏసగా మాట్లాడే సందర్భాల్లోనో సాకాయన అయ్యేది. మఱి ఛాందసులు ప్రతీదానికీ, ఒత్తి షకారము, శకారము, కరారాముడు ఇచ్చే పద్ధతిలో శాఖాయన అయేది. పేరు పంతులుగారని సర్వసాధారణంగా గద్వాల సంస్థానపు విద్వాన్ నుండి వీధిబడి పంతులు వఱకు లాతిమనిషి పిలవబడ్డం మన తెలుఁగు దేశంలో పరిపాటే.

ఏవం విధంగా నామకరణ మహోత్సవం జఱిపి శాఖాపంతులుగారి జీవిత సంగ్రహ ముఖ్యోద్దీపిత చర్యను గుఱించి చాటించేం. ఓ చదువరులారా! ఆయన జీవితంలో జ్ఞాపకం వుంచుకోవలసినవి రాజకీయంగా గాని, ఆర్థికంగా గాని, ఆంతరంగికంగా గాని, బహిరంగంగా గాని,

ఆధ్యాత్మకంగా గాని, ఐహికంగా గాని, ఏమీ కనిపించవు— నిరాడంబర మహర్షుల్లో నిరాడంబర మహర్షిమల్లే, నిర్లిప్తుడు, నిరవశేష విజ్ఞాని, నిర్మలినుడు, నిరహంకారుడు — అందేతనే ఇంత నిత్తై సత్తెంగా వెలిసిపొయ్యేడు. ఒక్క సంగతే ఆయనకు తెలుసును. ఆ ఒక్క సంగతే ఆయన అందర్నీ చేయమనేవాడు—

అసాధారణమైన ఆశ్చర్యంతో ఈ అనంత ప్రపంచ నిర్మాణ మందలి యే పదార్థమునూ చూడాలనేవాడు. తన నోరు విప్పుకొని కళ్ల ప్పంశిచుకొని నిర్ఘాంతపోతూ దర్శించేవాడు. ఓ మామిడిచెట్టు చిగురు పట్టిందనుకోండి; లేదా పూత పూసిందనుకోండి; మన యీ నరుడు ఆ తోటడ్డమడి పోతూపోతూ ఆ చెట్టుకేసి అట్టే నిశ్చేష్టుడై చూస్తూ, తనలో తానే, ఎవరు లేకపోయినా ఎవరితోనో అన్నట్టుగా ఆహా : ఎంత బాగా చిగిర్చింది! ఎంత బాగా పూసింది! ఆహా! ఆహా! ఆహా! అని అక్కడో కాస్సేపటి కేరై తేనా కంటబడ్డా "సామీ! ఓయి రామసామీ! చూడు ఆ చిగురు చూడు! ఏం చెట్టోయి! ఆ పూవు చూడు! ఏం పూలోయి! ఎంతందంగా చిగిర్చింది!" అని అతడుకూడా తనతోపాటు చూచేదాకా పురిగొల్పేవాడు. ఓ కొండ దగ్గర్నుంచి పోయేవాడనుకోండి. ఆ కొండదిగు భాగంనుండీ పైశిఖరందాకా ఓసారి తన దృగంచలాల్తో కుంచెట్టి ప్రామినట్టు ప్రామేసేవాడు. ఇటూ అటూ కొండనీడను పరికించి మళ్ళీ కొండకేసి చూసేవాడు. చూచి "ఆహా! కొండ! కొండ! కొండ! ఎంత యెత్తుంది! ఎంత రూఢంగా వుంది! ఎంత నీడ! ఎంత నీడ! ఆహా! ఆహా! ఆహా!" అని తా సృష్టించి అక్కడ దాన్ని, తాఁ బ్రతిష్టించి నట్టుగానే తండైనట్టుగానే గబగబా యెక్కిపోతూ ఎగిరిపోతూ పైని నిలబడి చుట్టూ చూచేవాడు. మళ్ళీ ఆ చూపుతో మళ్ళీ కొత్త కొత్త చిత్ర విచిత్ర దృష్టి ప్రపుష్టి! చిట్టచివర

కతగా డావింత చర్యవల్ల ఎట్లాగా లోకంలో పరిణమించి పొయ్యేడూ అంటే — లోకమంతా అతగాణ్ణి వింతగా చూస్తూ "ఏం మనిషి ! ఏం వింతయితగానిది ! ఏం కొత్త పుంత ! యితని పంథ ! ఓహో !" అనడం ఎక్కడ చూచినా మాఱు(మోగిపోయింది. అతగాడి యశస్సు, అతగాడి ఆశయము, అతగాడి సందేశం, అతగాడి ఆదేశం, అన్నీకూడి గుణించి తీసేసి భాగించి నికరం తేలిస్తే తేలేది ఒక్కమాట. "వింత" అనే ఒక్కమాట ! విపరీతంగా వింతపొయ్యేడు.

తుద కావింత ఎంత పనిచేసిందో వినండి ! ఒకనాడర్ధ నిశీథినీ సమయంలో — కాళరాత్రి – తాళసాలతమాల హింతాలాది మహామహీజ జాలంబులనూచుచు, కాక భేక ఘూక బలాకపికశారిక కీరమయూరగృధ్ర గండభేరుండ ప్రముఖ సమస్తాండజంబుల నూచమట్టుగ నేలగూల్చుచు, గర్భనిర్భేదకంబగు గర్జనంబుతో, దర్జనిభంగి ఝుళిపించు క్రొమ్మెరుంగుతో సాంద్రజలదంబులిళ్ళపయిని మళ్ళపయిని నేళ్ళపయిని సముద్రపుంగరళ్ళ పయిని కాలకూట విషంబునుంగురియ, మహాభయంకరంబుగ వీచువిచండ ఝంఝూనిలంబెగయ, వైహాయసవీధినుండి మహీస్థలి కంట తమోరాశినా ద్రోసికొని మూసికొని రోషిల్లినది. ఏది ? కాళరాత్రి — లోకానికా చీకట్లో దెలియకుండానే పెండాలు పెంకులుసహా, గోడలు గుమ్మాలుసహా ఇళ్ళన్నీ కాళీ యిచ్చివేసినాయి.

కథలో పంతులుగారు గ్రుడ్లుపైకిదేల్చి నోరావలించి వేసినారు ....

తెల్లాతేసరికంతా నిర్మలంగావుంది. సూర్యోదయం మామోలు సూర్యునిద్వారా కాకుండా మతో క్రొత్త సూర్యునిగుండా అయినట్టుయింది. పదిమందీ పంతులుగారి చుట్టూమూగినారు. పంతులుగారు పక్కకు

తిరగడంలేదు. పలకడంలేదు — ఉన్నదున్నట్టు జరిగింది జరిగినటు చెప్పడమే కాబట్టి చెప్పేస్తున్నా. పంతులుగార్కి పైని నిరూపించిన అనుకూల కాలాగమనంతోపాటు మృత్యుదేవతా సందర్శనం లభించింది. లభించిన వెంటనే సహజాశ్చర్య నిమగ్న చిత్తైకాగ్ర గణ్యుడౌటచే "ఆహా మృత్యువు! ఏమి మృత్యువూ! ఎటువంటి మృత్యువూ! ఓహ్హో మృత్యువూ!!! అనిఅదే అనుకోవడం అదే అనుకోవడం. ఆ అనుకోవడం అభినయించుకోవడంలోకి మాతేసరికి నోరావలింపున్నూ కళ్ళు తేలింపున్నూ కలిగి అంతకంటే తానదివఱకుగన్న దృశ్యంగాని ఇక గనఁబోవు దృశ్యంగాని మఱెక్కువ వింతగున్న దేదీలేందౌటచే తేల్చిన కళ్ల తేల్చినట్లేవుంచి, శరీరస్మృతి తప్పి కాళ్లుచల్లబడి వాళ్ళిగమై చివరకు గాలి లోగాలి ఏకముగాఁ బరమపదించినారు.

జనుల్లో కొంత తడవుదాకా ఆ నరుడింకా జీవించియుండి దేనినో ఆశ్చర్యంగా చూచుచున్నాడనే యభిప్రాయం. ఆ మీమాంసతో అపరాహ్ణం తిరిగిపోయినా ఊళ్లో వంటల్లేవు. భోజనాల్లేవు. కొంతసేపటికో మహాత్ముడు పైనుంచి అవతరించినట్టుగా ఎక్కణ్ణుంచో దిగినవాడై "వెఱ్ఱి ప్రజల్లారా! ఉన్న దున్నట్టుగానూ జరిగింది జరిగినట్టుగానూ యోజిస్తే యెన్నాళ్ళకూ సంశయ నివృత్తిగానేరదు. మీరేమో అతని శరీరమింకా దేనినోగూర్చి దేనినోయేల? మృత్యుదేవతను గూర్చియే కానిండు సహజాశ్చర్యచిత్తైకాగ్రగణ్యత దిలకించు చున్నాడని యనుకొను చున్నారు కామోసు. ఆ ఆశ్చర్య మన్నదంతా ఆత్మదిగాని యీ శరీరముది కాదు. మనము లేనిది లేనట్టుకూడా తెలుసుకోవాలి; యీ శరీరం లేనిది ఆత్మ మాత్రమే యున్నది. కాబట్టి ఇతడు పొందిన, పొందుచున్న పొందబొయ్యే యావదాశ్చర్యమూ ఆత్మపరంగాని శరీరపరమెంతమాత్రం

గావు. కాబట్టి యీ శరీరమున కుచితదహన సంస్కారాదులొనర్చి యితని యాత్మకు శాంతిసెప్పి కొనుచు మీరు పప్పూ కూడూ భుజింపుడు అని హెచ్చరించేడు. అదిగో చితి ? అదిగో ద్యుతి ! ఓం తత్సత్ !

రచన	స్ఫురణ	తొలిప్రకటనము
13-12-1932	లక్ష్మిన్నరసాపురం	"వినోదిని"లో